
## కంది, వేరుశెనగ, ఆముదం పంట పొలాలు పరిశీలించిన శాస్త్రవేత్తలు

**- చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై రైతులకు సూచనలు**



కంది పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త

మండల పరిధి లోని కోనాపురం, చిన్నముష్టూరు, లత్తవరం గ్రామాల్లో ఖరీఫ్ పంట కాలంలో సాగులోవున్న చీడపీడలు ఆశించిన కంది, వేరుశెనగ, ఆముదం పంట పొలాలను శనివారం ఏఆర్ఎస్ శాస్త్రవేత్త మాధవిలత, ప్రిన్సిపల్ సైంటిస్టు నారాయణస్వామి, అగ్రనమిస్టు నటరాజ్ బృందం పరిశీలించింది. స్థానిక ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్ సిబ్బందితో కలిసి పంట పొలాలను పరిశీలించిన వారు రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆముదం పంటలో గెలకు ఆశించిన తెగులు నివారణకు సాఫ్ 2 మిల్లీ లీటర్ల మందును ఒ లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కాగా ఏవో శుభకర్ వివిధ ఫర్టిలైజర్స్ దుకాణాలను తనిఖీచేసి డెలిగేట్, ఎక్సోకోనస్ మందుల నిల్వలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగుల మందులు కొనేటపుడు క్యూఆర్ కోడ్ పరిశీలించి తీసుకోవాలని, కొన్న ప్రతి వస్తువుకు తప్పక బిల్లులు తీసుకోవాలని సూచించారు.

## వైభవంగా శ్రీవారి ప్రాకారోత్సవం

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త



శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం దృశ్యం

వంశధార పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళంలో వెలసిన లక్ష్మినరసింహస్వామి ఆలయంలో స్వస్తిశ్రీ క్రోధినామ సంవత్సరం శ్రావణ శుద్ధ త్రయోదశి శనివారం సాయంత్రం లక్ష్మినరసింహుని ప్రాకారోత్సవం వైభవంగా, కన్నుల పండువగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణ అధికారి కె.విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీదేవి, భూదేవి సమేత నృసింహస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి శోభాయమానంగా తీర్చిదిద్దిన పల్లకీలో కొలువుదీరి చగా ప్రధానాలయం చుట్టూ ప్రదీక్షిణ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండే కాకుండా కర్నాటక ప్రాంతం నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చి శ్రీవారిని దర్శించుకొని ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. క్షేత్రం గుండా గలగలపారే నీటి జలపాతాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో 96.05శాతం పింఛన్ల పంపిణీ

**- తెల్లవారుజాము నుండే లబ్దిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ**

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త



పింఛన్ల పంపిణీను పర్యవేక్షిస్తున్న మేజర్ పంచాయతీ కార్యదర్శి ఎ.గౌస్‌సాహెబ్

మండలంలో శనివారం జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమం సాయంత్రం 4.50 గంటల సమయానికి 96.05శాతం పూర్తి అయింది. తెల్లవారుజాము నుండే లబ్దిదారుల ఇంటింటికీ వెళ్లి ఉద్యోగులు మండలంలోని 10,256 మంది లబ్దిదారులకుగాను 9,821 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. సెప్టెంబర్ 1వ తేదీన ఆదివారం కావడంతో ఒకరోజు ముందుగానే రాష్ట్ర ప్రభుత్వ లబ్దిదారులకు పింఛన్ల పంపిణీ చేపట్టిన విషయం తెలిసిందే. ఉరవకొండ పట్టణంలోని 5 సచివాలయాల పరిధిలో 4,103 మంది లబ్దిదారులకుగాను 3,925 మందికి, పెద్ద కౌకుంట్ల పంచాయతీలో 2 సచివాలయాల పరిధిలో 970 మందికిగాను 921 మందికి, ఆమిద్యాల పంచాయతీలోని రెండు సచివాలయాల పరిధిలో 873 మందికిగాను 845 మందికి పింఛన్లను పంపిణీ చేశారు. నింబగల్లు సచివాలయం పరిధిలో 532 మందికిగాను 507 మందికి, రాకెట్ల సచివాలయం పరిధిలో 607 మందికిగాను 584 మందికి, చిన్నముష్టూరు సచివాలయం పరిధిలో 641 మందికిగాను 623 మందికి, షేక్షానుపల్లి సచివాలయం పరిధిలో 585 మందికిగాను 557 మందికి, రాయంపల్లి సచివాలయం పరిధిలో 386 మందికిగాను 371 మందికి, మోపిడి సచివాలయం పరిధిలో 393 మందికిగాను 382 మందికి, లత్తవరం సచివాలయం పరిధిలో 333 మందికిగాను 320 మందికి, నెరమెట్ల సచివాలయం పరిధిలో 337 మందికిగాను 331 మందికి, వెలిగొండ సచివాలయం పరిధిలో 231 మందికిగాను 225 మందికి, బూదగవి సచివాలయం పరిధిలో 234 మందికిగాను 230 మందికి పింఛన్లను పంపిణీ చేశారు.

## రాజ్యాంగం ద్వారా అందరికీ సమాన హక్కులు కల్పించబడ్డాయి

**- సివిల్ రైట్స్ డే కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా**

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త



పౌర హక్కుల దినోత్సవంలో మాట్లాడుతున్న తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా

రాజ్యాంగం పౌరులందరికీ వ్యక్తిగతంగా, సమిష్టిగా కొన్ని ప్రాథమిక స్వేచ్ఛలను అందిస్తోందనివాటికి ఎవరూ భంగం కలిగించాలనిచూసినా వారు చట్టపరంగా శిక్షార్హులవుతారని మండల తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా పేర్కొన్నారు. మండల పరిధిలోని మోపిడి గ్రామంలోని ఆర్డీటీ పాఠశాలలో గ్రామ సర్పంచ్ సిద్దప్ప అధ్యక్షతన సివిల్ రైట్స్ డేను నిర్వహించి ప్రజలకు పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషా మాట్లాడుతూ మతం, జాతి, కులం, లింగం పుట్టిన ప్రదేశం ఆధారంగా వివక్షను నిషేదించడానికి సమానత్వ హక్కు చట్టం తీసుకురావడం జరిగిందన్నారు. ఏదైనా వృత్తి, వృత్తిని అభ్యసించే హక్కు, భద్రత, భావప్రకటన స్వేచ్ఛ కోసం, బలవంతపు శ్రమ, బాల కార్మిక వ్యవస్థలను నిషేదించడానికి దోపిడి వ్యతిరేక హక్కు కల్పించబడిందన్నారు. స్వేచ్ఛ, వృత్తి, అభ్యాసం, మత ప్రచార హక్కులు కల్పించబడ్డాయని వాటిని ప్రతిఒక్కరూ తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సీనియర్ సహాయకులు సాయిక్రిష్ణ వంశీ, హౌసింగ్ ఏఈ అశ్వర్థనారాయణ, పంచాయతీ కార్యదర్శి రమణకుమార్, వార్డెన్ జగన్నాథ్, వీఆర్ఓ, మాజీ సర్పంచ్ గోవిందు తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ఉచిత అల్పాహారం ఏర్పాటు

గుంతకల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా కసాపురం ఆంజనేయస్వామి దేవాలయానికి వచ్చే భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. దాదాపు 1200మందికి జూటూరుహనుమంతరాయుడు, న్యాయ వాది జిపి తిమ్మారెడ్డి సహకారంతో అల్పాహారం అందచేసినట్లు లయన్స్‌క్లబ్ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు చక్కా జగన్‌మోహన్, సోయజాక్ష, సుదర్శన్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఆర్టీసి బస్సును ప్రారంభించిన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్సీ

మడకశిర ఆగస్టు 31 ప్రభాతవార్త;

పట్టణంలోని అమరాపురం బస్టాండ్ నందు ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు నూతన ఆర్టీసి బస్సును శనివారం ప్రారంభించారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు బస్సును ప్రారంభించిన తరువాత కొద్దిదూరం బస్సును నడిపి అందరిలో ఉత్సాహాన్ని నింపారు. ఈ నూతన బస్సు మడకశిర నుండి కర్నూలు రూటు ఉంటుందని ఆర్టీసి డిపో మేనేజర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసి సిబ్బంది, తేదేపా కన్వీనర్, కౌన్సిలర్లు, మున్సిపల్ కమీషనర్, తెలుగుదేశం, జనసేన. బిజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పండుగలా ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ



మొక్కలను నాటుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ



వృద్ధురాలికి పెన్షన్‌ను ఇస్తున్న ఎమ్మెల్యే , మాజీ ఎమ్మెల్సీ

మడకశిర ఆగస్టు 31 ప్రభాతవార్త;

ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను శనివారం ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు వృద్ధులకు, వితంతువులకు, వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి పండుగలా పెన్షన్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు మాట్లాడుతూ సెప్టంబర్ నెల 1వతేదీ ఆదివారం కావడంతో నారాచంద్రబాబునాయుడు ఆదేశాలకు మేరకు ఒక్క రోజు ముందుగానే ఆగష్టు 31వ తేదీనే పెన్షన్లను అందజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మరియు మండలంలోని పటుచోట్ల మొక్కలను నాటి పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తేదేపా రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, మడకశిర పట్టణ కన్వీనర్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి బ్యాటరీ, ఇన్వర్టర్ వితరణ

**- త్రివేణి ఫర్టిలైజర్స్ యజమాని రాయల్ భీమన్న ఔదార్యం**

ఉరవకొండ, ఆగస్టు 31 ప్రభాతవార్త



బ్యాటరీ ఇన్వర్టర్‌ను డీసీహెచ్ఎస్ పాల్ రవికుమార్‌కు అప్పగిస్తున్న దాత త్రివేణి ఫర్టిలైజర్స్ రాయల్ భీమన్న

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలోని 50 పడకల ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రికు పట్టణానికి చెందిన త్రివేణి ఫర్టిలైజర్స్ దుకాణం యజమాని రాయల్ భీమన్న 24వేల రూపాయలు విలువ చేసే బ్యాటరీ, ఇన్‌వర్టర్‌ను అందజేశారు. శనివారం ఆసుపత్రిలో వైద్యాధికారి డాక్టర్ ఎల్లోజీ అధ్యక్షత జరిగిన కార్యక్రమానికి డీసీహెచ్ఎస్ (డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్) డాక్టర్ పాల్ రవికుమార్ ముఖ్య అతిధిగా హాజరుకాగా ఆయన బ్యాటరీ, ఇన్వర్టర్‌ను అప్పగించారు. ఈ సందర్బంగా దాత రాయల్ భీమన్న మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయం సమయంలో అత్యవసర వైద్య గదిలో క్షతగాత్రులకు వైద్యం అందించడానికి వైద్యులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారని తెలియడంతో బ్యాటరీ, ఇన్వర్టర్‌ను అందించడం జరిగిందన్నారు. ఉరవకొండలో ఇంత పెద్ద ఆసుపత్రి ఏర్పాటుకు మంత్రి పయ్యావుల కేశవ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు.

## అన్నదాన కార్యక్రమానికి రూ.25 వేలు విరాళం

గుంతకల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త



చెక్కు అందచేస్తున్న మంజుల వెంకటేష్

వినాయకచవితి ఉత్సవాల్లో భాగంగా వినాయఘాట్ వద్ద నిమజ్జనం రోజు ఏర్పాటు చేసే అన్నదాన కార్యక్రమానికి బిజెవైఎం జిల్లా అధ్యక్షులు మంజుల వెంకటేష్ 25 వేల రూపాయల విరాళం అందచేశారు. నగర ఉత్సవ సమితి కోశాధికారి ఇల్లూరు లక్ష్మినారాయణకు శనివారం ఈ విరాళం అందచేశారు. ఈ సందర్భంగా మంజుల వెంకటేష్ మాట్లాడుతూ నిమజ్జనం కోసం పాల్గొనే భక్తులకు తనవంతుసాయంగా భోజనం అందించాలన్న ఉద్దేశ్యంతో ఈ విరాళం మొత్తాన్ని అందచేసినట్లు ఆయన తెలిపారు.


## ఘనంగా శ్రీశనీశ్వరస్వామికి హారతి ఉత్సవాలు

అమరాపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త



పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని ఆలదపల్లి గ్రామంలో శ్రావణమాసం శనివారం పురస్కరించుకుని శ్రీ శనీశ్వర స్వామికి ప్రతి ఇంటి నుండి మహిళలు హారతిఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన దేవాలయాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. శ్రీశనీశ్వరస్వామి దేవాలయంవద్ద స్వామివారి ఉత్సవమూర్తికిహారతులునిర్వహించగా అదేవిధంగా ఆలయ అర్చకులు స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. ఆలదపల్లి గ్రామంలో జరిగిన ఉత్సవాల్లో అమరాపురం ఎస్ఐ జనార్థన్‌నాయుడు, టిడిపి మండల కన్వీనర్ గణేష్, మాజీ కన్వీనర్ శివరుద్రప్ప, మడకశిర నియోజకవర్గం ఎస్‌సిసెల్ అధ్యక్షులు జయకుమార్, వాల్మీకి సాధికారిక సభ్యుడు మంజునాథ్, టిఎన్‌టియుసి ఉపాధ్యక్షులు రామచంద్రప్ప, మాజీ ఎంపిటిసి శివకుమార్, నాగరాజు, రామ్మూర్తి, సిద్దేశ్, మాజీ సర్పంచు పాండురంగప్ప, మాజీ స్పంచు చంద్రప్ప, యంజారప్ప, తదితరులు పాల్గొన్నారు. అమరావతి, హేమావతి, కెంకెర, శివరం, బసవనపల్లి తదితర గ్రామాల్లో శ్రీశనీశ్వరస్వామిమి విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



హారతి ఉత్సవాల దృశ్యం

## గుత్తి మున్సిపల్ కమీషనర్‌గా జబ్బార్‌మియా బాధ్యతల స్వీకరణ



మున్సిపల్ కమీషనర్‌గా బాధ్యతలు చేపట్టిన దృశ్యం

గుత్తి, ఆగస్టు 31 ప్రభాతవార్త

గుత్తి మున్సిపాలిటీ నూతన మున్సిపల్ కమీషనర్‌గా జబ్బార్‌మియా శనివారం బాధ్యతలు చేపట్టారు. స్థానికంగా పనిచేస్తున్న శ్రీనివాసులును పెనుకొండ కమీషనర్‌గా బదిలీచేశారు. ఆయన స్థానంలో మైదుకూరు నుండి జబ్బార్‌మియాను స్థానికంగా నియమించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సర్ వన్నూర్‌బీ అధ్యక్షతన జరిగిన కౌన్సిల్‌మీట్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సభ్యులు తీర్మాంచించారు. నూతన మున్సిపల్ కమీషనర్‌ను సమావేశం స్వాగతించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ వరలక్ష్మి, కౌన్సిలర్లు హసీనా, రాజ్యలక్ష్మి, సుజాత, సులోచన, రూపావతి, ఖాజాఖాన్, కో ఆప్షన్ సభ్యులు మైనుద్దిన్, కమలాక్షమ్మ, కళ్యాణి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మహిళా వైద్యురాలి హత్యాచారం పట్ల బాలికలు కొవ్వొత్తులతో నిరసన

గుత్తి, ఆగస్టు 31 ప్రభాతవార్త




బాలికలు కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న దృశ్యం

కలకత్తాలోని మహిళా వైద్యురాలి పట్ల జరిగిన హత్యాచారాన్ని ఖండిస్తూ శనివారం హరిత దివ్యాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో బాలికలు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కారకుల పై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు మోహన్‌నాయక్, చంద్రకళ, వరలక్ష్మి, భార్గవి, సావిత్రి, పూజ, సవిత, రేష్మ, తదితరులు పాల్గొన్నారు.

## భారతావనిలో కమలం వికసిస్తోంది.. 20 కోట్ల సభ్యత్వాలే టార్గెట్

**- విశ్వగురువు మోడి పాలనలో అభివృద్ధిలో ప్రపంచంలోనే 18 నుండి 3వ స్థానంలోకి వచ్చాం - సత్యసాయి జిల్లాలో 4 లక్షల సభ్యత్వాలే లక్ష్యంగా ప్రతి ఇంటి నుండి భాగస్వామ్యం చేస్తాం - గోరంట్లలో బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్ స్పష్టీకరణ**

గోరంట్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త



పాత్రికేయులతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షులు



సమావేశంలో పాల్గొన్న మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు

దేశవ్యాప్తంగా భారతీయజనతాపార్టీ చేపడుతున్న నూతన సభ్యత్వ నమోదు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ప్రతి అసెంబ్లీ నియోజక వర్గంలో 50 వేల సభ్యత్వాలు తగ్గకుండా చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా భారతీయజనతాపార్టీ అధ్యక్షులు జిఎం శేఖర్ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన శనివారం గోరంట్ల పట్టణంలోని తన నివాసంలో పాత్రికేయుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీసత్యసాయి జిల్లాట 4 లక్షల సభ్యత్వాలే లక్ష్యంగా చేసుకున్నామన్నారు. ఇందు కోసం సెప్టెంబర్ 1 నుండి కార్యాచరణ ప్రారంభమవుతుందన్నారు. గ్రామస్థాయి బూత్‌లెవల్ నుండి ప్రతి ఇంటి నుండి బిజెపి సభ్యత్వ నమోదుకు ముందుకు సాగుతున్నామన్నారు. ప్రపంచ దేశాల్లో భారతీయ జనతాపార్టీ సభ్యత్వాలు అగ్రగామిగా నిలపనున్నామని ప్రధాని నరేంద్రమోడి విశ్వగురువుగా మారారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. సెప్టెంబర్ 2 నుండి 40 రోజుల పాటు నరేంద్రమోడి చేతుల మీదుగా ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. గతంలో ఉమ్మడి జిల్లాలో రెండున్నర లక్ష్యల సభ్యత్వ నమోదులు వుండేవనిన ప్రస్తుతం సత్యసాయి జిల్లాలోనే 4 లక్షల సభ్యత్వాలు చేయాలన్న లక్ష్యంతో కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 18 కోట్ల సభ్యత్వాలు నమోదు కార్యక్రమాలు ప్రారంభిస్తునాన్మన్నారు. ప్రపంచ దేశాల్లో భారత్ అగ్రగామిగా నిలిచిందని ప్రపంచ చిత్రపటంపై భారత ప్రధాని విశ్వ గురువుగా మారారని దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రతి ఇంటి నుండి బిజెపి సభ్యత్వ నమోదు వుండేలా కార్యాచరణ సిద్ధం చేశామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, పూలగంగాధర్, బొట్టు శ్రీనివాసులు, నాగరాజుయాదవ్, కాటేపల్లి నరేష్, కొర్రు ఆంజనేయులు, బేకరి అశోక్, తుకారం, షబ్బీర్, హరీఫ్, కాటేపల్లి అశ్వర్థ, శంకర్, రామాంజినేయులు, వెంకటేష్, లక్ష్మీనరసు, లక్ష్మీదేవమ్మ, ముంతాజమ్మ, రామాంజనేయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## కాలేజ్ జూనియర్ అసిస్టెంట్ నరసింహులుకు పదవీవిరమణ సన్మానం

గోరంట్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త



పదవీవిరమణ పొందిన నరసింహులును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

పట్టణంలోని ఎస్‌పిఎం జూనియర్ కళాశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నరసింహులు శనివారం పదవీవిరమణ పొందారు. స్థానిక కళాశాలలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎన్‌కె డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కెంపుల లక్ష్మినారాయణ, ఎస్‌పిఎస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మినారాయణ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహులును యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు రమేష్, రామకృష్ణ, శ్రీనివాసులు, శివ, రవి, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగి పదవీ విరమణ ఓ మహా యజ్ఞం

**- మండల పరిషత్ కార్యాలయంలో ఇఓఆర్‌డికి ఘన వీడ్కోలు**

గోరంట్ల, ఆగస్టు 31 ప్రభాతవార్త



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్



పదవీ విరమణ పొందిన ఇఓఆర్‌డిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రతి ఉద్యోగి ఎంతో పని ఒత్తిడిని ఎదుర్కొని పదవీవిరమణ ఓ యజ్ఞం లాంటిందని జిల్లా పంచాయతీ అధికారి విజయకుమార్ పేర్కొన్నారు. గోరంట్ల ఇఓఆర్‌డి సుధాకర్ పదవీవిరమణ సమావేశంలో ఆయన అభిప్రాయపడ్డారు. విధి నిర్వహణలో ఉద్యోగి ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని ఇటు ప్రజలకు అటు ప్రభుత్వానికి వారధిలా వుంటూ సేవలు అందించి ఉద్యోగి పదవీవిరమణ అనే ఒక ఆఖరి విధి నిర్వహణ రోజు ఉద్యోగికి ఒక తీపి జ్ఞాపకంగా మిగిలిపోతుందని వక్తలు గుర్తు చేశారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఇఓఆర్‌డి సుధాకర్ పదవీవిరమణ సన్మాన కార్యక్రమాన్ని ఎంపిడిఒ రఘునాథ్‌గుప్తా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఒ విజయకుమార్, జిల్లా నోడల్ అధికారి శివారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పదవీవిరమణ పొందిన సుధాకర్ సేవలను తోటి ఉద్యోగులు కొనియాడారు. అనంతరం ఆయనను శాలువాలు, పూలమాలలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో సర్పంచు నరసింహమూర్తి, గంగప్ప, అశ్వర్థరెడ్డి, ముసలిరెడ్డి, వెంకటశివారెడ్డి, బోర్‌వెల్ అశ్వర్థరెడ్డి, ఆదినారాయణ, గంగాధర్, కొండాపురం రమణ, నర్సి రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, ఎంపిడిఒ కార్యాలయం సిబ్బంది. సీనియర్ అసిస్టెంట్ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా లక్ష్మినరసింహస్వామి గరుడ వాహన ఉత్సవం

రాయదుర్గం, ఆగస్టు 31 ప్రభాతవార్త:



ప్రత్యేక పుష్పఅలంకరణలో ఉన్న లక్ష్మినరసింహస్వామి



స్వామివారి పల్లకిని ఊరేగిస్తున్న భక్తులు

మండలంలోని మల్లాపురం గ్రామంలో వెలసిన విప్రమలై శ్రీ లక్ష్మినరసింహస్వామి పల్లకి ఉత్సవం శనివారం ఘనంగా జరిగింది. ప్రతి ఏడాది శ్రావణమాసంలో వచ్చే నాల్గవ శనివారం నరసింహస్వామికి గరుడ వాహనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ సందర్భంగా ఆలయ కమిటి గౌరవాధ్యక్షులు రామ్మూర్తి స్వామీజీ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యం స్వామి శ్రీలక్ష్మిసమేతస్వామివారికి సుప్రభాతసేవ, పంచామృతాబిషేకం, పుష్పాఅలంకరణ, ఆకుల పూజ, నైవేద్య పూజలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించిన పల్లకిలో స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని అధిష్టించి మేళ తాళాలతో ఊరేగించారు. మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వినియోగం గావించారు. శ్రావణమాసం చివరిశనివారంకావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు రాయదుర్గం వాసులైన రాతిబావివంక నరసింహశెట్ట కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు ఉచిత అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ కమిటి అధ్యక్షులు బిఎస్ తిప్పేస్వామి, ఉపాధ్యక్షులు ధర్మన్న, కోశాధికారులు జీఎం. నరసింహులు, ఎస్ఆర్ఎస్ సత్యనారాయణ, కార్యదర్శి గురురాఘవేంద్రప్రసాద్, సభ్యులు గురునాథ్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఐ, ఎస్సైలను సన్మానించిన తెదేపా నాయకులు

కణేకల్లు, ఆగస్టు 31 ప్రభాతవార్త:



సీఐ, ఎస్సైలను సన్మానిసునతన్న తెదేపా నాయకులు

కణేకల్లు నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన నాగమధు మరియు రాయదుర్గం సీఐని తెలుగు దేశం పార్టీ నాయకులు శనివారం కణేకల్లు పోలీస్ స్టేషన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కల్పి పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జల్లా ఉపాధ్యక్షులు వేలూరు మరియప్ప, మండలకన్వీనర్ కలేకుర్తి లాలేప్ప, హనుమాపురం సర్పంచ్ జయరాంచౌదరి, మాల్యం శరభన్నగౌడ్, మహేష్‌గౌడ్, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## టమోటా రైతుల నిలువు దోపిడిని ఆపండి

**- జాక్పాట్ కమిషన్ పేరుతో వ్యాపారుల దగా**

**- సిపిఐ సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున**

అనంతపురం, ఆగస్టు 31 ప్రభాతవార్త బ్యూరో:



డిఆర్ఓకు వినతిపత్రం అందిస్తున్న సిపిఐ నాయకులు

టమోటా రైతులను జాక్పాట్ పేరుతో నిలువు దోపిడిని ఆపాలని జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున డిమాండ్ చేశారు. శనివారం సిపిఐ, జిల్లా రైతు సంఘం ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ రామకృష్ణరెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు కురువక, దిగుబడి దక్కక, ధరలు పడిపోయి టమోట రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. అనంతపురం జిల్లాలో రైతులు అధిక సంఖ్యలో టమోట పంట సాగు చేశారని, పండిన పంటను కక్కలపల్లి, టమోటా మార్కెట్‌కి అమ్మకానికి తరలిస్తే ఇక్కడ మండివారు, వ్యాపారులు కుమ్మకై జాక్పాట్ పేరుతో రూ.100బాక్సులకు నాలుగు బాక్సులు ఉచితంగా తీసుకొని రైతుల వద్ద దోపిడీ చేస్తున్నారన్నారు. మరో వైపు రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కక్కలపల్లి మార్కెట్లో కమీషన్ 10%పేరుతో దోపిడీ చేస్తూ, హమాలీ పేరుతో సైతం డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. అసలే గిట్టుబాటు ధరలు లేని పరిస్థితుల్లో ఆయోమయంలో ఉన్న రైతులు ఈ విధంగా దోచుకోవడం విడ్డూరకరమన్నారు. మదనపల్లి, పలమనేర్ మార్కెట్లో ఎటువంటి జాక్పాట్ గానీ, బాక్సులపైన గానీ, హమాలీల పేరుతో గానీ ఎటువంటి వస్తువులు లేవన్నారు. గిట్టుబాటు ధరలేని పంటను మదనపల్లి తీసుకెళ్లడానికి రవాణా అదనపు భారం అవుతుందని కక్కలప్లి మార్కెట్‌కు తీసుకువస్తే జాక్పో పేరుతో రైతులను దోపిడీ చేస్తూ మరింత నష్టాలపాలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు వెంటనే ఈ విధానం రద్దుపరిచి జాక్పార్టు రద్దు చేస్తూ రైతు కమిషన్ కూడా ఐదు లేదా ఏడు పర్సెంట్ మాత్రమే వసూలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. హమాలీలకు మండి వారే డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకొని టమోటా రైతుని ఆదుకోవడానికి ప్రభుత్వం కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించాలని అనంతపురం జిల్లా రైతు సంఘం నుంచి ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాప్తాడు నియోజకవర్గం కార్యదర్శి పి.రామకృష్ణ, దుర్గాప్రసాద్, రైతు సంఘం జిల్లా నాయకులు బి.నగేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

